ఏటిపాయకు మళ్లీ వరద

- భారీ వర్షాలతో స్తంభించిన జనజీవనం
- నీట మునిగిన పంట పొలాలు

కంకిపాడు: ఎగువున కురుస్తున్న భారీ వర్షాలతో ఏటిపాయకు మళ్లీ వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రకాశం బ్యారేజీ గేట్లు తెరవటంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ సముద్రం వైపు పరుగులు తీస్తోంది. ఏటిపాయ అంచులు తాకుతూ కృష్ణానది పాయలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం పరిధి గుండా ప్రవహిస్తున్న కృష్ణానది ఏటిపాయ బుధవారం వరద నీటితో పొంగి పొర్లుతోంది. పాయ అంచులు తాకుతూ నీరు దిగువకు పరవళ్లు తొక్కుతోంది. వరద నీటితో మరోసారి ఏటిపాయలోని లంక భూముల్లోకి వెళ్లే రోడ్డు మార్గం ముంపునకు గురైంది. కాసరనేనివారిపాలెం వద్ద ఏటి ఒడ్డున ఉన్న శివాలయం చుట్టూ వరదనీరు వచ్చి చేరింది. మత్స్యకారులు ఏటిపాయలో ఉన్న పడవలను అతికష్టం మీద ఒడ్డుకు చేర్చి భద్రపర్చుకున్నారు. ఏటిపాయకు నీరు చేరటంతో కొందరు మత్స్యకారులు ఏటి ఒడ్డున చేపల వేట సాగిస్తున్నారు.


వరద నీటిలో కాసరనేనివారిపాలెం శివాలయం


మద్దూరులో నీట మునిగిన వరి పొలాలు

భారీ వర్షాలతో అస్తవ్యస్తం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మంగళవారం, బుధవారం సాయంత్రం వేళల్లో ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. వర్షం కారణంగా కంకిపాడు పట్టణంలోని బస్టాండు ప్రాంగణం వర్షం నీటితో చెరువును తలపించింది. పునాదిపాడు ప్రధాన సెంటరు, రైతుబజారు, కంకిపాడు సర్వీసు రోడ్డు సెంటర్లలో వర్షం నీరు నిలిచిపోయి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఈడుపుగల్లు, గొడవర్రు, పరిసరాల్లోని జగనన్న లే అవుట్‌లలో రహదారులు బురదమయంగా మారి ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేక అవస్థలు పడాల్సి వచ్చింది.

300 ఎకరాల్లో పంట మునక..

భారీ వర్షం కారణంగా మండలంలోని మద్దూరు-పరిధిలో సుమారు 300 ఎకరాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. పొలాల్లో మురుగుపోయే మార్గం లేక రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఒక్కో రైతు ఎకరాకు రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టారు. వర్షానికి వరి నాట్లు మునిగి కుళ్లిపోతే మరలా నాట్లు వేసేందుకు ఆస్కారం కూడా లేదని వాపోతున్నారు. వర్షం నీరు కాసరనేనివారిపాలెం-మద్దూరు రోడ్డు మార్గం మీదుగా ప్రవహిస్తోంది.

రైతుల్లో ఆందోళన

కరకట్ట దిగువున సాగు చేస్తున్న రైతుల్లో ఆందోళన నెలకొంది. పంటల సాగు జరుగుతున్నందున వరద నీరు పొలాల్లోకి చేరితే పంటలు మునిగిపోయే ప్రమాదం ఉంది. గతేడాది వరదల కారణంగా పంటలు మునిగితే ప్రభుత్వ సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఉచిత పంటల బీమా లేనందున తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


కాసనేనివారిపాలెం రోడ్డుపై వర్షపునీరు


కంకిపాడు సర్వీసురోడ్డులో నిలిచిన వర్షపునీరు


వాటర్‌ప్లాంట్ వద్ద ఉధృతంగా వరద

క్లుప్తంగా

నిజాయతీ చూపిన కార్మికురాలు



కంకిపాడు: బంగారం, నగదుతో ఉన్న బ్యాగును పోలీసులకు అప్పగించి నిజాయతీ చూపింది ఓ కార్మికురాలు. వివరాల్లోకి వెళితే.. గొడవర్రు గ్రామానికి చెందిన స్వర్ణ పద్మావతి కంకిపాడు ఆస్పత్రికి వచ్చింది. అనంతరం ఇంటికి వెళ్లే క్రమంలో మసీదు సెంటరులోని పెట్రోలు బంకు సమీపంలో తనతో తెచ్చిన బంగారు వస్తువులతో కూడిన బ్యాగును పోగొట్టుకుంది. అటుగా వెళ్తున్న కంకిపాడు రైతుబజారు కార్మికురాలు గుంటూరు లీలా రాణి బ్యాగును చూసి దాన్ని తీసుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి అప్పగించింది. అప్పటికే అక్కడ తన బంగారు వస్తువుల బ్యాగు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేసిన స్వర్ణ పద్మావతి ఆ బ్యాగు తనదేనని ఆధారాలతో చూపారు. అందులో ఉన్న మూడు కాసుల నల్లపూసల గొలుసు, రెండు ఉంగరాలు, రూ.3 వేలు నగదును బాధితురాలు పద్మావతికి సీఐ మురళీకృష్ణ సమక్షంలో అదనపు ఎస్ఐ తాతాచార్యులు అందించారు. లీలారాణిని ప్రత్యేకంగా అభినందించారు.

పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ



పెనమలూరు: మండల పరిధిలో కృష్ణానది పరవళ్లు తొక్కుతుంది. నదిలో ఎగువ నుంచి దాదాపు 3 లక్షల క్యూసెక్కుల వరద నీరు రావటంతో నదిలో జల కళ సతరించుకుంది. మండలంలో యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల పరిధిలో కృష్ణానది ప్రవహిస్తోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి వరద నీరు నదిలోకి వదలటంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మూడు గ్రామాల ఘాట్‌ల వద్దకు వరద నీరు చేరుకుంది. కృష్ణానది లంకలతో సంబంధాలు తెగిపోయాయి. యనమలకుదురు, పెదపులిపాక గ్రామాల వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మరో రెండడుగుల వరద పెరిగితే కరకట్ట దిగువన ఉన్న గృహాల్లోకి నీరు వచ్చే అవకాశం ఉంది. దీంతో కరకట్ట దిగువున ఉన్న వారు ఆందోళన చెందుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వరద నీరు పెరిగితే నివాసితులు, రైతులు, పశువుల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలుపుతున్నారు. వరద పెరిగితే నివాసితులు ఇళ్ల నుంచి బయటకు రావాలని సూచిస్తున్నారు. వర్షాలు పడితే నదికి వరద పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. రాత్రి సమయంలో జాగ్రత్తగా ఉండాలని అధికారులు తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న బుడమేరు

- రామవరప్పాడు పాత వంతెనపై నుంచి పారుతున్న బుడమేరు
- ముంపునకు గురవుతున్న పంట పొలాలు

రామవరప్పాడు: గతేడాది బుడమేరు సృష్టించిన బీభత్సం మరువక ముందే మరలా బుడమేరు పొంగుతుండటంతో ప్రజల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు కాల్వగట్టు ప్రాంతం బుడమేరు పాత వంతెన ముంపునకు గురైంది. నగరం నుంచి బుడమేరు కాలువలో వరదనీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో కాలువ నిండుగా ప్రవహిస్తోంది. ఫలితంగా గ్రామంలోని బుడమేరు కాలువ వంతెనపై నుంచి వరదనీరు ప్రవహిస్తున్నాయి. దీంతో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు. వరద నీరు వంతెనపై నుంచి ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించాయి. ఈ వంతెన మీదుగా ఫ్లై ఓవర్, అబ్దుల్ కలాం కాలనీ, గుణదల తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మరో వైపు గ్రామంతో పాటు పక్క గ్రామాల రైతులు తమ పంట పొలాలకు కూడా వెళ్తుంటారు. దశాబ్దాల కాలం నిర్మించిన పాత వంతెన శిథిలావస్థకు చేరుకోవడం, పైగా వరదనీరు వంతెనను ముంచెత్తడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

నివాసాల మధ్యకు చేరిన వరద

రెండు రోజుల నుంచి కురుస్తోన్న వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న అధిక నీటి ఫలితంగా బుడమేరు పొంగింది. దీంతో కాలువ సమీపంలోని పలు నివాసాల్లోకి వరద నీరు చేరుకుంది. బుడమేరు కాలువకు ఆనుకుని ఉన్న పొలాలు ముంపునకు గురయ్యాయి. క్రమేణా కాలువలో నీటి ఉధృతి పెరుగుతుండటంతో కాలువ కట్ట వాసులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే గతేడాది పడిన ఇబ్బందులు మళ్లీ తప్పవని భయాందోళనలు చెందుతున్నారు. వరద నీటితో పాటు వ్యర్థాలు కాలువలో కొట్టుకురావడంతో రామవరప్పాడు బుడమేరు వంతెన వద్ద వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. ఈ వ్యర్థాలు అడ్డుపడటంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. ఫలితంగా వరద నీరు రహదారికి పైకి చేరుకుంది.

అధికారుల పర్యవేక్షణ

గ్రామంలో బుడమేరు వంతెన వద్ద నెలకొన్న పరిస్థితులను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో చర్యలు చేపట్టారు. డీపీవో లావణ్యకుమారి, ఎంపీడీవో విగ్గిన్స్, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ వంతెన వద్ద పరిస్థితులను పరిశీలించారు. భారీగా పేరుకుపోయిన వ్యర్థాలను జేసీబీతో కొంత వరకు తొలగింపజేశారు. వ్యర్థాలను లారీల ద్వారా బయటకు తరలిస్తున్నారు. కాలువ నీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



బుడమేరు కాలువ సమీప పొలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

సచివాలయాల్లో కమిషనర్ తనిఖీలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలోని వార్డు సచివాలయాలను తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్. నజీర్ బుధవారం తనిఖీలు చేశారు. ఆయన పోరంకి, యనమలకుదురులో సచివాలయాలు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సచివాలయాల పరిధిలో పీ - 4 సర్వే పగడ్బందీగా పూర్తి చేయాలన్నారు. దాతలను గుర్తించి పథకం అమలుకు కృషి చేయాలని తెలిపారు. సచివాలయాలలో పని తీరు మెరుగుపర్చాలన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి వెంటనే పరిష్కారం చేయాలని ఆదేశించారు. ప్రధాన సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సచివాలయాల సిబ్బంది సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తెలిపారు.

అవయవ దానంపై అవగాహన అవసరం

పెనమలూరు: విద్యార్థులు అవయవ దానంపై అవగాహన పొందాలని ఏపీ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎ.మోహన్ అన్నారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్, మణిపాల్ ఆస్పత్రి సంయుక్తంగా అవయవ దానంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సేవపై కూడా దృష్టిపెట్టాలన్నారు. సమాజ సేవ చేయటం వలన విద్యార్థుల్లో బాధ్యత పెరుగుతుందని తెలిపారు. మణిపాల్ ఆస్పత్రి డైరెక్టర్ జె.రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ.. అవయవ దానంలో మహిళలు ముందంజలో ఉన్నారన్నారు. భారత ప్రభుత్వం జీవన్‌దాన్‌తో అవయవ దానం ద్వారా రెండో సారి జీవించే అవకాశం కలిగించిందన్నారు. కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు, ప్రొ.వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.రవిచంద్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.శివరామప్రసాద్, ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.మాధవి, వైద్యులు, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రజారోగ్యం, భద్రత దృష్ట్యా వినాయక చవితి ఉత్సవ మండపాల వద్ద డీజే సౌండ్, బాణాసంచా కాల్పులు పూర్తిగా నిషేధమని వీరవల్లి ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు ముందస్తుగా అనుమతులు పొందాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్న ఉత్సవ కమిటీ సభ్యులే పూర్తి బాధ్యులవుతారని చెప్పారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీలు

నున్న(విజయవాడరూరల్): అజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నున్న గ్రామంలో హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ జరిగింది. గ్రామంలో అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులు జాతీయ పతాకాలను చేత పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో పంచాయతీ కార్యదర్శి కె.సురేష్ బాబు, సచివాలయ సిబ్బంది, నాయకులు శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, సాంబిరెడ్డి, దండు సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

గన్నవరం(ఉంగుటూరు): మండల కేంద్రమైన ఉంగుటూరులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, ఎస్ఆర్ఈజీఎస్, వెలుగు కార్యాలయ సిబ్బంది తివర్ణ పతాకాలను చేతపట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. శుక్రవారం జరగనున్న స్వాతంత్ర్య వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని, తహసీల్దార్ జె.విమలకుమారి, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ పాల్గొన్నారు.

గ్రామగ్రామాన ర్యాలీలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామాల్లో వివిధ శాఖల ఉద్యోగులు జాతీయ జెండాలతో ర్యాలీలు చేశారు. స్థానిక మహాత్మా గాంధీనగర్‌లో జరిగిన తిరంగా ర్యాలీలో తహసీల్దార్ మురళీకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీవో త్రినాథరావు, పంచాయతీరాజ్ ఏఈ జయరాజు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ

పెనమలూరు: భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో యనమలకుదురు గ్రామంలో బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. జిల్లా యువమోర్చా అధ్యక్షుడు గోపిశెట్టి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. యువతలో దేశభక్తి పెంపొందించే విధంగా పాఠశాలలు, కాలేజీల్లో జాతీయ జెండాతో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. సూర్యా విద్యానికేతన్ ప్రిన్సిపాల్ అలీ, మోర్చా నాయకులు మావులూరి ప్రఖ్యాత్, కంఠమనేని సాయి, దీపక్, విద్యార్థులు పాల్గొన్నారు.


నున్నలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సంక్షిప్తంగా...

● కురుమ కులస్తులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కురుమ సామాజికవర్గీయులకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని వైఎస్సార్ సీపీ కురుమ, కురుబ, మాదాసి కులాల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగిరి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు కురుమ సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులతో బుధవారం వారు సమావేశమయ్యారు. కురుమ సామాజికవర్గంలో రాజకీయ చైతన్యం కలిగించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు వారు చెప్పారు. నాయకులు దన్నె పరమ వాసు, చెన్నుబోయిన శివయ్య, మాయర వెంకటేశ్వరరావు, పడకల వీర్రాజు, చెన్నుబోయిన ఉమామహేశ్వరరావు, పడకల కోటేశ్వరరావు, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, మంగళపాటి జ్యోతి కుమార్, శ్రావణ్, మజ్జి కుటుంబరావు పాల్గొన్నారు.

● మాదక ద్రవ్య రహిత సమాజాన్ని తీర్చిదిద్దాలి

కంకిపాడు: సమాజాన్ని మాదక ద్రవ్య రహితంగా మార్చటానికి ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను నిర్వర్తించాలని సీఐ జె.మురళీకృష్ణ అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం కంకిపాడు పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించారు. సిబ్బందితో సీఐ మురళీకృష్ణ ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ సమాజ ఉన్నతిలో యువత పాత్ర కీలకమన్నారు. యువశక్తి నిర్వీర్యం కాకూడదన్నారు. మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్ఐలు డి.సందీప్, తాతాచార్యులు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

రాయపూడి శ్రీనివాసరావు

● 'హలో మాల - చలో ఢిల్లీ' విజయవంతం చేయాలి

కంకిపాడు: హక్కుల సాధన కోసం చేపట్టిన హలో మాల-చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు పిలుపునిచ్చారు. కంకిపాడు లాకులు వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్యక్రమ కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోగులమూడి రాజు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై ఏపీ ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకూ ఢిల్లీలో జరగనున్న ధర్నాలను విజయవంతం చేయాలన్నారు. సంఘ నాయకులు వర్రె చిట్టిబాబు, సిరివెళ్ల చిట్టిబాబు, మాచర్ల రవి, సరిహద్దు ఆంతోని, సవలం మునిస్వామి, రాంబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

● రైల్వే ఆర్వోబీల నిర్మాణానికి క్షేత్రస్థాయి పరిశీలన

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలోని వీరవల్లి, అంపాపురం గ్రామాల్లో రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రతిపాదిత ఆర్వోబీల నిర్మాణానికి రెవెన్యూ అధికారులు బుధవారం స్థల పరిశీలన చేశారు. గుడివాడ ఆర్డీవో జి.బాల సుబ్రహ్మణ్యం, ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జహీద్ ఆయా గ్రామాల్లో పర్యటించారు. రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ చేపట్టేందుకు క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఆర్వోబీల నిర్మాణానికి అవసరమైన భూలభ్యతపై బాపులపాడు తహసీల్దార్ బి.మురళీకృష్ణతో చర్చించారు.

● ఎరువుల అధిక వినియోగం వద్దు

పెనమలూరు: రైతులు ఖరీఫ్ సాగులో అవసరాల మేరకు ఎరువులు వినియోగించాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె బుధవారం పెనమలూరు, చోడవరం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి దుబ్బు దశలో ఉన్నందుక కాంప్లెక్స్ ఎరువులు వాడి ఉపయోగం లేదన్నారు. పంట ఎదుగుదల పరిస్థితిని బట్టి ఎరువుల వాడాలని సూచించారు. రైతులు పొలం గట్లపై కంది పంట సాగు చేయాలన్నారు. రైతులకు కంది విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు.

● పుస్తక పఠనంతో విజయం సాధించవచ్చు

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు పుస్తక పఠనం చేయడం ద్వారా విజయం సాధించవచ్చనని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రత్యేక అధికారి డాక్టర్ వెలగా జోషి అన్నారు. నున్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఫ్రెండ్స్ స్టేషన్‌లో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం దిశా నిర్దేశ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జోషి మాట్లాడుతూ.. సెల్ ఫోన్లకు బానిసలు కావద్దని, ఫోన్లను తెలివిగా ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల ప్రాంగణ నియామకాలకు కళాశాల కరస్పాండెంట్ నరెడ్ల సత్యనారాయణరెడ్డి తీసుకుంటున్న చర్యలను జోషి అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు రోజువారి సబ్జెక్ట్స్‌తో పాటు అదనంగా కమ్యూనికేషన్ స్కిల్స్, అదనపు కోర్సులు నేర్చుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఎన్.సత్యనారాయణరెడ్డి, ఫార్మసీ డీన్ డాక్టర్ నరేంద్ర కుమార్‌రెడ్డి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

● కొనసాగుతున్న ఎన్ఎంయూఏ ధర్నా

గన్నవరం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వరుసగా రెండో రోజు స్థానిక డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. న్యాయబద్ధమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవోస్ గన్నవరం తాలూకా యూనిట్ అధ్యక్షుడు సాంబశివరావు మాట్లాడుతూ.. పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయడంతో పాటు వేతన సవరణ ముగిసి రెండేళ్లు పూర్తకావడంతో ఐఆర్‌ను ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.నాగిరెడ్డి కోరారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలని, పారదర్శకమైన బదిలీ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. అసోసియేషన్ నాయకులు జ్యోతికుమార్, రాజు, రంగారావు, ఉషారాణి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.





